కథ

# అంచనా

**ప్రభాకరం భార్యవలన చాలా అశాంతిగా వుందట. అస్సలు ఇంటి గురించి పట్టించుకోదట. ఎంతసేపు తన జల్సాలు, తన చీరలు, తన ఘోషే తప్ప ఉన్న వారి గురించి ఆలోచించనే ఆలోచించదట.**

ప్రభాకరం ప్రేమకథ నాకు ఒక ఏడాదిగా తెలుసును.

ప్రభాకరం మావారి కొలీగ్. ఇద్దరిమధ్యా చెప్పుకోదగిన స్నేహమే ఉంది. అందుకని అతని స్వవిషయాలన్నీ ఆల్‌మోస్ట్ ఆల్ మాకు ఎరుకే.

ప్రభాకరం ప్రేమించిన అమ్మాయి వందన చాలా అందమైనది అని అనలేంగానీ ఆ ఫేస్‌లో ఏదో వింత ఆకర్షణ ఉంది. ఆకర్షణనీ, అందాన్నీ మించిన ఆత్మవిశ్వాసమేదో గోచరిస్తుంది ఆమె ముఖంలో. వందన చాలా ఫ్యాషన్‌గా, ఇంకాస్త స్టయిల్‌గా ఉండేది. లేటెస్ట్ ఫ్యాషన్ చుడీదార్‌లూ, గాగ్రాఛోళీలు, మంచి కాస్మెటిక్స్ అవీ ఉపయోగిస్తుంటుంది ఎక్కువగా.

ప్రభాకరం, వందన కలసి తిరగని ప్రదేశమేలేదు. ఒకరోజు సినిమా థియేటర్ దగ్గర కనిపిస్తే, ఇంకోరోజు బీచ్ దగ్గర, ఇంకో రోజు గుళ్లో...ఇలా రకరకాలచోట్ల.

ప్రభాకరానిది మంచి ఉద్యోగమే. వందన కూడా ఏదో చిన్న జాబ్ చేస్తోంది. వందన తల్లిదండ్రులకి ఒక్కర్తే సంతానం. ప్రభాకరం ఇంటికి పెద్దకొడుకు. అందరూ అతని సంపాదన మీదే ఆధారపడుతూ బ్రతుకుతున్నారని చాలాసార్లు చెప్పాడతను.

ప్రభాకరం మావారిని 'భయ్యా' అనీ, నన్ను 'భాభీ' అని పిలిచేవాడు. తన సెలక్షన్ ఎలా వుందంటూ అడిగేవాడు నన్ను.

'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా ఉన్నారని నేనిచ్చిన కాంప్లిమెంట్‌తో అతని భుజాలు గజాలయ్యేవి.

ఓనాడు హఠాత్తుగా మా ఇంటికి మ్యారేజ్ ఇన్విటేషన్స్‌తోసహా వచ్చాడు ప్రభాకరం.

''భాభీ! తప్పకుండా నా పెళ్లికి రావాలి మీరు. ఏరా భయ్యా తీసుకురాకపోతే ఊరుకోను!'' అంటూ మరీ మరీ ఆహ్వానించాడు ఇన్విటేషన్ ఇస్తూ.

''ఏమిటింత సడెన్‌గా...?'' అడిగారు మావారు.

''ఇప్పుడు తప్పితే మరో ఆర్నెల్లదాకా ముహూర్తాలు లేవట!''

''అచ్చా!'' అంటూ ఇన్విటేషన్ పరికిస్తున్న నేను ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను.

కారణం...వధువు పేరు ఉండవలసిన చోట 'వందన' అని కాక 'వాణి' అని ఉండడమే!

ఒక్కసారిగా ఆశ్చర్యపోయాను.

నిన్నమొన్నటిదాకా చెట్టాపట్టాలేసుకుని విహరించిన ప్రేమ జంట ఇలా విడిపోవడానికి కారణమేమిటో నాకు అర్థం అవలేదు.

ఆమాటే అడిగాను ప్రభాకరాన్ని.

ఒక్కసారిగా అతని ముఖం మాడిపోయిన పెనంలా నల్లబడింది.

కాస్సేపు ఊరుకుని అన్నాడతను.

''ఆ అమ్మాయి మెంటాలిటీకి, నాకూ సరిపడదు భాబీ. ఆ అమ్మాయిదంతా జాలీ టైపు. జీవితం లగ్జరీగా గడపాలని వుంటుంది వందనకి. నాదా పెద్ద సంసారం. ఇంటికి నేనే పెద్దవాడినవడంతో అన్ని బాధ్యతలూ నేనే భరించాలి. ఈ బాధ్యతల బరువులతోపాటు వందన ఖరీదైన కోరికలు తీర్చడం నావల్లకాని పని. అందుకే ఇంకో అమ్మాయిని చేసుకుంటున్నాను'' తలదించుకునే చెప్పాడు ప్రభాకరం.

''ఇంకా చిన్నపిల్లకదా! పెళ్లయ్యాక నెమ్మదిగా మారుతుందేమో?'' నా అభిప్రాయం వెలిబుచ్చాను.

''లేదు భాభీ. వందన చిన్నప్పటినుండీ ఒక్కర్తే పెరగడానికి అలవాటుపడింది. అలాంటి అమ్మాయి నలుగురితో కలసి మెలగలేదు. కానీ వాణి పదిమందిలో పుట్టి పెరిగిన పిల్ల. ఉమ్మడి కుటుంబపు సాధక బాధకాలన్నీ ఆ అమ్మాయికి తెలుసు. అన్నీ ఆలోచించుకునే ఈ నిర్ణయానికొచ్చాను!'' ప్రభాకరం కంఠంలో స్థిరత్వం ధ్వనించింది.

''సరేలే...విష్ యూ ఆల్ ది బెస్ట్. నేనూ మీ వదిన తప్పక వస్తాం'' వాతావరణాన్ని తేలికపరుస్తూ అన్నారు మావారు.

నాకెందుకో ప్రభాకరం చేసిన పని అంతగా నచ్చలేదు.

''వందన ప్రస్తావన తేకుండా ఉండాల్సింది నువ్వు?'' అన్నారు మావారు అతనెళ్లాక.

''ఏం...తెస్తే ఏంటట? ఏడాదిపాటు ఆమెతో సినిమాలకీ, షికార్లకి తిరిగినప్పుడు తెలియలేదా అతనికి వందన స్వభావం. ఆమెలో ఆశలు కల్పించి తీరా పెళ్లి దగ్గరకొచ్చేసరికి మొహం చాటేయడం సబబేనంటారా? వందన, అతను కలసి తిరగడం ఈ ఊళ్లో అందరికీ తెలుసును. రేపొద్దున ఆ అమ్మాయిని ఎవరు చేసుకుంటారన్న ఆలోచన కూడా లేకుండా తన దారి తను చూసుకున్నాడు మహానుభావుడు. అంతా సెల్ఫిష్‌నెస్'' అతని మీద కోపం మావారి మీద చూపిస్తూ జాడించేసాను పట్టుకుని. నా ధాటికి కిమ్మనలేదు మరి మావారు.

ప్రభాకరం పెళ్లికి నేను వెళ్లలేదు అతనిమీద కోపంతో. మావారు మాత్రం ఎటెండయ్యారు.

★★★

ఇది జరిగిన ఓ పదిరోజులకి వందన గుళ్లో కనబడింది. మనిషి చిక్కి సగమైంది. ముఖంలో మునుపటి కళాకాంతులులేవు. వందనను చూస్తే నాకెందుకో జాలేసింది.

''వందనా! ఏంటిలా అయిపోయావు? ప్రభాకరం చేసిన ద్రోహం తెలిసి చాలా బాధపడ్డాను. పోనీ ఏం జరిగినా అంతా మన మంచికే!'' ఊరడించాను.

ఆపాటి పలకరింపుకే పిల్లగాలి సోకిన మేఘంలా వర్షించసాగాయామె కన్నులు.

''ఆ ఛీట్ సంగతి నా దగ్గర ఎత్తొద్దు శాంతక్కా. వట్టి అవకాశవాది. కట్నంకోసం కక్కుర్తిపడ్డాడు. వారి కుటుంబంలో నేను ఇమడలేనట. ఆ బరువు బాధ్యతలు మోయలేనట'' వెక్కుతూనే అంది వందన అది గుడి అని కూడా చూడకుండా నన్ను కరుచుకుపోయి.

''ఊరుకో వందనా! సారీ...నీ గుండెకయిన గాయాన్ని కెలికి నిన్ను బాధపెట్టాను. వెరీసారీ'' ఆమె వీపు నిమురుతూ ఓదార్చాను.

''ఛ...ఛ... నువ్వేం చేశావక్కా. ఆత్మీయురాలివి కనుక నిన్ను చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేకపోయానంతే'' కళ్లనీళ్లు తుడుచుకుంటూ అంది వందన.

కాస్సేపు ఆ మాట, ఈ మాట మాట్లాడి ఇంటికొచ్చేశాను నేను. అది మొదలు అప్పుడప్పుడు వందన కలుస్తూ వుండేది నాకు. ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నట్టే అనిపించేది నాకు.

కానీ ప్రభాకరం ఆ తరువాత మా ఇంటికి రావడం తగ్గించాడు. కొన్నాళ్లకి పూర్తిగా మానేశాడు. బహుశా సంసార బాధ్యతల నుండి కాబోలు.

★★★

''ఏమోయ్! ఇది విన్నావా?'' బయట నుండి వచ్చిన మావారు హాల్లో సోఫాలో కూర్చుని షూస్ విప్పుతూ అరిచారు.

''ఏదీ...మీరు చెప్పనిదే నాకెలా తెలుస్తుంది!'' అదే రేంజ్‌లో అడిగాన్నేను.

''ఇందాక బజార్లో ప్రభాకరం వాళ్ళ మదర్ కనబడ్డారు. ప్రభాకరం భార్యవలన చాలా అశాంతిగా వుందట. అస్సలు ఇంటి గురించి పట్టించుకోదట. ఎంతసేపు తన జల్సాలు, తన చీరలు, తన ఘోషే తప్ప ఉన్నవారి గురించి ఆలోచించనే ఆలోచించదట. ఆవిడ ప్రవర్తన వలన కొడుకు చాలా ఇబ్బంది పడ్తున్నాడంటూ ఆవిడ ఒకటే గొడవ'' అన్నారు మావారు నిట్టూరుస్తూ.

''ఎవరి బుద్ధులెలా వక్రిస్తాయో చెప్పలేం. అందుకే అంటారు తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడని...'' వేదాంత ధోరణిలో అన్నానేను.

ఒంటరిగా పెరిగిందని వందన తన ఫ్యామిలీలో అడ్జస్టు కాలేదన్న సాకుతో ఆమెని దూరం చేసుకున్నాడు ప్రభాకరం. నలుగురిలో పుట్టి పెరిగిన పిల్ల తన కుటుంబంలో పాలునీళ్లలా కలసిపోతుందని ఊహించి వాణిని చేసుకుంటే జరిగిందేమిటి?




—కె.కె. భాగ్యశ్రీ

ఇక్కడే ప్రభాకరం అంచనా ఘోరంగా తప్పింది.

ఏ వందననైతే తన కుటుంబంలో ఇమడలేదని అతను కాదన్నాడో ఆ వందనే తన అత్తవారింటికి పెద్ద కోడలిగా ఇటు సంసార సారథ్యం, అటు ఉద్యోగ భారం రెంటినీ సమర్థవంతంగా నిర్వహిస్తూ అందరిచేత ఉత్తమురాలని కొనియాడబడుతోంది.

అయితే ఇదంతా నాకెలా తెలిసిందంటారా! వందన ఇప్పుడు మా చిన్నమామగారి పెద్దకోడలు.

మా ఇంట్లో ఓసారి మా చిన్నమామయ్యగారబ్బాయి శేఖర్ వందనని చూడడం, ఇష్టపడడం, వందన కూడా ఫ్రాంక్‌గా తన గతాన్నంతటినీ అతనికి చెప్పడం, అంతా విన్నాక కూడా శేఖర్ ఆమెనే తన అర్ధాంగిగా స్వీకరించడం... ఇవన్నీ... ఇవన్నీ సినిమా సంఘటనల్లా చకచకా జరిగిపోయాయి.

దీనంతటికీ మీడియేటర్ ఎవరు అనుకుంటున్నారా? నేనే!

అందుకే నేనంటాను ఏ మనిషిని కొద్దిపాటి పరిచయంతో తప్పుడు అంచనా వేయకూడదని. మరి మీరేమంటారు?

☆